## నేటి నుంచి పలు రైళ్లు రద్దు

కాజీపేట, డిసెంబర్ 18: సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని కాజీపేట రైల్వే జంక్షన్– బల్లార్ష సెక్షన్‌లోని హసన్‌పర్తి రోడ్డు–ఉప్పల్ రైల్వే స్టేషన్ల మధ్య జరుగుతున్న మూడో లైన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా నేటి నుంచి జనవరి 13 వరకు పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. కాజీపేట రైల్వే జంక్షన్– సిర్పూర్ రైల్వే స్టేషన్, బల్లార్ష– కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య నడిచే రామగిరి మెమొ రైలును రాకపోకలను ఈ నెల 19 నుంచి జనవరి 13 వరకు, సికింద్రాబాద్– సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే రైలును రాక పోకల్లో జనవరి 2 నుంచి 13 వరకు రద్దు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

## కుటుంబ కలహాలతో పూజారి ఆత్మహత్య

సుబేదారి, డిసెంబర్18 : కుటుంబ కలహాలతో పూజారి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ షుకూర్ కథనం ప్రకారం.. భద్రాది కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన అచ్చి శ్రీరామకృష్ణ (38) కొన్ని ఏళ్ల నుంచి ఎస్వీ కాలనీలో నివాసం ఉంటూ పూజారిగా పని చేస్తున్నాడు. గొడవలతో భార్య ఈనెల 16న పుట్టింటికి వెళ్లింది. మానసికంగా కుంగిపోయి సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# అన్నదాతల కన్నెర్ర

- ధాన్యం ధర తగ్గించారని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ఎదుట ఆందోళన
- ఒకరిద్దరు రైతులకే గరిష్ఠ ధర ఇస్తున్నారని ఆగ్రహం
- వ్యాపారులు కుమ్మక్కై ధర తగ్గించారని ఆరోపణ
- నేడు మార్కెట్‌కు సెలవు
- ఒకే రోజు 43వేల బస్తాల ధాన్యం రాక



కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

కేసముద్రం, డిసెంబర్ 18 : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి ధర తగ్గడంతో రైతులు కన్నెర్ర చేశారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సోమవారం ఒక్కరోజే మార్కెట్‌కు 43 వేల బస్తాల ధాన్యం విక్రయానికి వచ్చింది. వ్యాపారులు క్వింటాలు జైశ్రీరాం రకానికి గరిష్ఠంగా రూ.3,301, కనిష్ఠంగా రూ.2009, ఆర్‌ఎన్‌ఆర్‌కు గరిష్ఠంగా క్వింటాలుకు రూ.3,159, కనిష్ఠంగా రూ.2000, హెచ్‌ఎంటీ రకానికి గరిష్ఠంగా రూ.3,259, కనిష్ఠంగా రూ. 2002 ధర నిర్ణయించారు. కాగా, మార్కెట్‌లో ఈ నెల 15న మార్కెట్‌లో పలికిన ధరల కంటే సోమవారం ధరలను తగ్గించారని రైతులు ఆందోళనకు దిగారు.

### ఒక్కరిద్దరికే గరిష్ఠ ధర...

రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన పంట ఉత్పత్తులకు వ్యాపారులు 'ఈ నామ్' ద్వారా టెండర్ వేస్తారు. ప్రతి రోజూ మధ్యాహ్నం ఒంటిగంటకు టెండర్ ఓపెన్ చేసి ధరలను నిర్ణయిస్తారు. అయితే, సోమవారం మార్కెట్‌కు పరిమితికి మించి ధాన్యం రావడంతో మధ్యాహ్నం 2 గంటల తర్వాత టెండర్ ఓపెన్ చేసి రైతులకు ధాన్యం ధరలను తెలియజేశారు. గతంలో ఉన్న ధరల కంటే ప్రస్తుతం ధరలు తగ్గించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యాన్ని బస్తాల్లోకి ఎత్తుతున్న కూలీలను అడ్డుకొని నిరసన తెలిపారు. వ్యాపారులు కావాలనే ధర తగ్గించారని ఆరోపిస్తూ మార్కెట్ కార్యాలయాన్ని ముట్టడించారు. అక్కడి నుంచి మార్కెట్ ఎదుట వరంగల్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. పరిమితికి మించి ధాన్యం విక్రయానికి వచ్చిందనే సాకుతో ఒకరిద్దరు రైతుల ధాన్యానికి మాత్రమే గరిష్ఠ ధర పెట్టి, మిగిలిన రైతుల ధాన్యానికి రూ.2800 కంటే తక్కువ ధర కేటాయించారని ఆరోపించారు. క్వింటాల్‌కు సుమారు రూ.400 పైగా ధర తగ్గించారని వాపోయారు. విషయం తెలుసుకున్న ఎస్సై తిరుపతి, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడినా శాంతించలేదు. కావాలనే వ్యాపారులు ధరలు తగ్గించారని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు, మార్కెట్ అధికారులు, మార్కెట్ చైర్‌పర్సన్ సుహాసినీ దుర్గేశ్ రైతులతో మాట్లాడారు. మిగిలిన మార్కెట్‌లలో కంటే కేసముద్రంలోనే ఎక్కువ ధర ఉందని సర్దిచెప్పినా రైతులు వినకుండా ఆందోళనను కొనసాగించారు. ఎక్కువ ధర పలికిన ధాన్యం రైతులు అమ్ముకోవచ్చని, తక్కువ ధర పలికిన ధాన్యానికి మంగళవారం మళ్లీ టెండర్ వేయిస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు. సుమారు 2 గంటల పాటు రైతులు ఆందోళన చేయడంతో తొర్రూరు, నెక్కొండకు వెళ్లే రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కాగా, మార్కెట్‌కు పరిమితికి మించి ధాన్యం రావడం.., టెండర్ ఆలస్యం.. ఫలితంగా కాంటాలు కూడా లేట్‌గా ప్రారంభమయ్యాయి. దీంతో మార్కెట్‌లో ధాన్యం పేరుకుపోయింది. మార్కెట్‌లో స్థలం లేనికారణంగా చైర్‌పర్సన్ సుహాసిని మంగళవారం మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. మార్కెట్ పరిస్థితులను గమనిస్తూ రైతులు ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు.

## మంత్రులకు 'లోక్‌సభ' బాధ్యతలు

- ఎన్నికల ఇన్‌చార్జిలుగా నియామకం
- వరంగల్ పార్లమెంట్‌కు సురేఖ
- మహబూబాబాద్‌కు పొంగులేటి..

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 18 : లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ సన్నద్ధమవుతున్నది. రాష్ట్ర మంత్రులకు లోక్‌సభ సెగ్మెంట్ల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. ఇతర రాష్ట్రాల నేతలను పరిశీలకులుగా నియమించింది. వరంగల్ లోక్‌సభ ఇన్‌చార్జిగా కొండా సురేఖ, మహబూబాబాద్‌కు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, భువనగిరికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కరీంనగర్‌కు పొన్నం ప్రభాకర్, పెద్దపల్లికి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కాంగ్రెస్ అధిష్ఠానం నియమించింది. వరంగల్ లోక్‌సభకు రవీంద్ర దల్వీ, మహబూబాబాద్‌కు శివశంకర్‌రెడ్డి, భువనగిరికి శ్రీనివాస్, కరీంనగర్‌కు క్రిష్టోఫర్ తిలక్, పెద్దపల్లికి మోహన్ జోషీని పరిశీలకులుగా నియమిస్తూ సోమవారం ప్రకటన జారీ చేసింది.



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

## 'కల్యాణలక్ష్మి' చెక్కుల పంపిణీ

ధర్మసాగర్, డిసెంబర్ 18 : కల్యాణలక్ష్మి పథకం ఆడబిడ్డలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే 82 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో మంజూరైన చెక్కులను తహసీల్దార్ సదానందం అధ్యక్షతన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ నిమ్మ కవితారెడ్డి, జడ్పీటీసీ పిట్టల శ్రీలత, సర్పంచ్‌లు మునిగెల రాజు, పెసరు రమేశ్, శరత్, యాకూబ్, శోభ, కవిత, అనిల్, ఎంపీటీసీలు నాగయ్య, శోభ, పెద్ది శ్రీనివాస్, జిల్లా కోఆప్షన్ సభ్యురాలు జుబేదా, డీటీ రోజారాణి, ఆర్‌ఐలు కిరణ్, శ్రీనివాస్, కరుణాకర్ రెడ్డి ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మెడికల్ ఆఫీసర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 18: కేయూ ఆరోగ్య కేంద్రంలో ఫుల్‌టైం మేల్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేయడానికి ఎంబీబీఎస్ అర్హత, మంచి వ్యక్తిత్వం, సేవా దృక్పథం గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు రిజిస్ట్రార్ టీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 22న సాయంత్రం 4 గంటలలోపు తమ బయోడేటా, ధ్రువపత్రాలను రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించాలని, ఇంటర్వ్యూలు నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని, ఎంపికైన అభ్యర్థులు బోధన, బోధనేతర సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులకు సేవలు అందించాలని, వారికి నెలకు రూ.35 వేల వేతనం ఉంటుందని తెలిపారు.

## క్రిస్మస్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- దుస్తుల పంపిణీ : కలెక్టర్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 18: క్రిస్మస్ వేడుకలు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో అధికారులు, క్రిస్మస్ సెలబ్రేషన్స్ ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులతో కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధ్యక్షతన సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ క్రిస్మస్‌తో పాటు అన్ని పండుగలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. సమన్వయంతో పండుగ నిర్వహించాలన్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగకు సంబంధించి ప్రతి నియోజకవర్గానికి దుస్తుల పంపిణీతో పాటు, పండుగ నిర్వహణకు రూ. 2 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. క్రిస్మస్ పండుగ నిర్వహణలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. పండుగ నిర్వహణలో ఏ సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డీసీపీ బారీ మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు. జీడబ్ల్యూఎంసీ అడిషనల్ కమిషనర్ రషీద్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ తరపున ఏర్పాట్లు చేస్తామన్నారు. డీఎంహెచ్‌వో సాంబశివరావు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ రోజు చర్చిల వద్ద ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్ మాట్లాడుతూ అన్ని జీపీల తరపున గ్రామాల్లో క్రిస్మస్ ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం పాస్టర్లు, క్రైస్తవులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు ఎల్ రమేశ్, శ్రీనివాస్, ఏసీపీ కిరణ్ కుమార్, పాస్టర్లు ఐజాక్, మంద కుమార్, ఇమ్మాన్యుయేల్, మైనార్టీ కమిషన్ సభ్యులు దర్శన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED




★Computer Operators, GNM Nurses, OT-Technicians & Compounders. Cont: Guardian Hospital, Opp: L.B. College, Warangal. Time: 12pm to 2 pm.
NTW-0325

★Wanted Male Councillor for our overseas consultancy (Experience Candidate will be preferred with attractive Salary). Cont: 8106349938, 9849248509.
NTW-321593

★మాస్టర్ ఫుట్‌వేర్, మండిబజార్, వరంగల్ నందు పనిచేయుటకు సేల్స్‌మెన్స్ కావలెను. వెంటనే సంప్ర: M. అస్లాం, సెల్: 9700909950
NTW-321591

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

CHANGE OF NAME

★I, KOUSER, R/O H No. 2-7-695/1, EXCISE COLONY, SUBEDARI, HANUMAKONDA-506001, T.S. Changed My Name As ASHA KOUSER W/o. HABEEB SYED
NT-324473

BUSINESS OFFER



★ఉ: 6 గం.ల నుండి మ: 12 గం.ల వరకు బైక్ ద్వారా గ్రామాల్లో తిరిగి శ్రీ విజయలక్ష్మి వెజ్ & నాన్ వెజ్ పచ్చళ్ళు అమ్మటం ద్వారా నెలకు 30 వేలు ఆపైన ఆదాయం వస్తుంది. బైక్ తప్పనిసరి. సంప్ర: 8143909459.
NTW-00

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

| HANAMKONDA | WARANAGAL |
|---|---|
| 9182777563 | 9182777556 |
| 9182777618 | 9182777557 |
| 9182777213 | 9182777558 |

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565